సాక్షి కర్నూలు

బుధవారం, 5, మార్చి, 2025



అట్టహాసంగా..
కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ 2019 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు.
- 8లో..



వీనుల విందుగా..
శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళా వేదికపై మంగళవారం అనంతపురం జిల్లా కోనాపురానికి చెందిన రామలింగేశ్వరస్వామి భజన మండలి వారి భజన భక్తులను అలరించింది.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	23.9
గరిష్టం	39.1



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:31	ఉ॥ 5:11
ఆదోని	సా॥ 6:30	ఉ॥ 5:13
నంద్యాల	సా॥ 6:28	ఉ॥ 5:11
ఆత్మకూరు	సా॥ 6:27	ఉ॥ 5:05
బనగానపల్లె	సా॥ 6:30	ఉ॥ 5:07

హదీస్ వెలుగు :
రంజాన్ ఉపవాస దీక్షలకు భంగం కలుగకుండా చంద్ర దర్శనమైన మరుక్షణమే సైతానును అల్లాహ్ ఖైదు చేసి ఉంచుతారు. ఈ మాసంలో రోజా, నమాజు, జికర్, జకాత్, ఆధ్యాత్మికతపై అధిక దృష్టి పెట్టండి. - పవిత్ర ఖురాన్

పారిచోద్యం.. డెంగీ భయం

పెద్దకడబూరు మండలం నౌలేకల్లు గ్రామానికి చెందిన అక్షయ(7) అనే బాలిక గత నెల 26న డెంగీ జ్వరంతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఇదే జ్వరం పాప అక్కలైన సిరివెన్నెల(12), సింధుప్రియ(9)లకు కూడా సోకింది. వారు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు.

గోనెగండ్ల మండలంలోని కులుమాల గ్రామంలో ఇటీవల ఓ మహిళకు డెంగీ జ్వరం రావడంతో కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించడంతో కోలుకుంది. విషయం తెలుసుకున్న మలేరియా అధికారులు గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి అవసరమైన చర్యలు చేపట్టారు.



- గత నెల 26న ఏడేళ్ల బాలిక మృతి
- చికిత్స పొందుతున్న మరో ఇద్దరు చిన్నారులు
- గత ఏడాది జిల్లాలో 306 కేసులు
- ఈ ఏడాది రెండు నెలలకే 35 కేసులు
- దోమలు విజృంభిస్తున్నా చర్యలు తీసుకోని అధికారులు

కర్నూలు(హాస్పిటల్): డెంగీ జ్వరం పేరు చెబితేనే దీని గురించి తెలిసిన వారితో పాటు సామాన్యులకూ వెన్నులో వణుకుపుడుతోంది. చిన్నదోమ కారణంగా వచ్చే ఈ వ్యాధి లక్షణాలతో బాధితులు ఆసుపత్రులకు వెళ్తున్నారు. రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గుతుంటే రోగుల సహాయకుల్లో మరింత ఆందోళన పెరుగుతోంది. ఎలాగైనా రోగిని ప్రాణాలతో దక్కించుకోవాలని అప్పులు చేయడానికి కూడా వెనుకాడటం లేదు. ఇదే సమయంలో సాధారణ జ్వరానికి సైతం కొందరు వైద్యులు, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు డెంగీ పేరుతో రోగులను దోచుకుంటున్నాయి.

ఏడాది పొడవునా డెంగీ కేసులు

కర్నూలు జిల్లా జనాభా 2024 సంవత్సర అంచనాల ప్రకారం 24.49లక్షలు. ఇందులో 12.31లక్షలు పురుషులు, 12.18లక్షలు స్త్రీలు ఉన్నారు. వైద్యపరంగా జిల్లాలో ఒక ప్రభుత్వ, ఒక ప్రైవేటు మెడికల్ కాలేజీలు, వాటికి అనుబంధంగా బోధనాసుపత్రులున్నాయి. వీటితో పాటు ఒక ఏరియా ఆసుపత్రి, ఐదు కమ్యూనిటి హెల్త్ సెంటర్లు, ఒక మాతాశిశు సంరక్షణ కేంద్రం, 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కొత్తగా మరో 12 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 502 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. వీటితో పాటు 150కి పైగా ప్రైవేటు ఆసుపత్రులు, మరో 300 దాకా క్లినిక్‌లు ఏర్పాటయ్యాయి. ఆయా ఆసుపత్రుల్లోని వైద్యుల వద్దకు సీజనల్ వారీగా ప్రతిరోజూ జ్వరపీడితులు చికిత్స కోసం వస్తుంటారు. ఒకప్పుడు వర్షాకాలంలో మాత్రమే దోమల ద్వారా


నౌలేకల్లు గ్రామంలో కాలువల్లో దోమల నివారణ మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా జ్వరాలు వచ్చేవి. ఇప్పుడు ఏడాది పొడవునా ఈ కేసులు నమోదవుతున్నాయి. గతంలో చాలా అరుదుగా నమోదయ్యే డెంగీ కేసులు కాస్తా ఇప్పుడు ప్రతి నిత్యం నమోదవుతూనే ఉన్నాయి. డెంగీకి సీజన్‌తో పనిలేకుండా అన్ని సీజన్‌లలో కేసులు నమోదవుతుండటంతో అధికారులు, వైద్యుల్లోనూ ఆందోళన నెలకొంది. తాజాగా పెద్దకడుబూరు మండలం నౌలేకల్లు గ్రామంలో ఇద్దరు అక్కాచెల్లెళ్లకు ఈ వ్యాధి సోకగా ఒక బాలిక మృతి చెందింది. దీంతో గ్రామంలో మలేరియా అధికారులు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి మించి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

డెంగీ పేరుతో దోపిడీ

చాలా వరకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ర్యాపిడ్ టెస్ట్ ద్వారా డెంగీ నిర్ధారణ అయిన వెంటనే లక్షణాలను బట్టి చికిత్స ప్రారంభిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ర్యాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్ రిపోర్ట్ వస్తే తమకు సమాచారం అందించాలని, ఈ మేరకు రక్తం సీరా తీసి కర్నూలు, ఆదోనిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎలీసా టెస్ట్ చేయించాలని చెబుతున్నారు. అక్కడి నివేదిక ఆధారంగానే డెంగీ వ్యాధిగా ఆసుపత్రులు ప్రకటించాలని చెబుతున్నారు. ఎలీసా టెస్ట్ రిపోర్టు రావాలంటే వారం, పదిరోజుల సమయం పడుతోందని, అప్పటి వరకు చికిత్స చేయకుండా ఎలాగని వైద్యులు ప్రశ్నిస్తున్నారు. ఇదే అదనుగా కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు మాత్రం ప్రతి సాధారణ జ్వరాన్ని డెంగీ లక్షణాలుగా పేర్కొంటూ రోగులను దోచుకుంటున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అవగాహన కను'మరుగు'

కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆలూరు, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం కొరవడింది. గత కొంత కాలంగా ఎక్కడ చూసినా మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు మురుగుకాల్వలు శుభ్రం చేయకపోవడం, అందులో వ్యర్థాలు వేయడంతో నీరు నిలిచిపోయి దోమలు పెరిగేందుకు ఆవాసంగా మారాయి. దీనికితోడు గ్రామాలు, పట్టణాల్లోని మురికివాడల్లో నీటి కొరత కారణంగా ప్రజలు నీటిని తొట్లలో నిల్వ చేసుకుంటున్నారు. నెలల తరబడి వాటిని శుభ్రం చేయకపోవడంతో అందులో లార్వా పెరిగి దోమలుగా మారుతున్నాయి. ఈ విషయమై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కల్పించడంలో విఫలం అయ్యాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మొక్కుబడిగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

డెంగీ లక్షణాలు
తీవ్రమైన తలనొప్పి, కళ్లు, కండరాలు, కీళ్లనొప్పులు ఉంటాయి. ఒంటిపై ఎర్రటి దురదలు కనిపిస్తాయి. ముక్కు, చిగుళ్లల్లో రక్తం స్రవిస్తుంది.

ఐదేళ్లుగా డెంగీ కేసుల నమోదు వివరాలు

సంవత్సరం	అనుమానిత లక్షణాలు	డెంగీ నిర్ధారణ కేసులు
2021	1,169	170
2022	4,088	342
2023	2,484	409
2024	2,200	306
2025 ఇప్పటివరకు	389	35

చర్యలు చేపడుతున్నాం



మలేరియా సిబ్బంది ద్వారా దోమల నివారణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వీరితో పాటు ఆశ, ఏఎన్‌ఎంలు ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితులుంటే రక్త పూతల పరీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో పాజిటివ్ వస్తే ఎలీసా టెస్ట్‌కు పంపిస్తున్నాం. అక్కడ కూడా పాజిటివ్ వస్తేనే డెంగీగా నిర్ధారించి నివారణ చర్యలు చేపడుతున్నాం.
–నూకరాజు, జిల్లా మలేరియా అధికారి, కర్నూలు

ఇలా తప్పించుకోవాలి

- డెంగీకారక ఏడిస్ ఈజిప్ట్ దోమ కేవలం పగలు మాత్రమే కుడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో శరీరాన్ని పూర్తిగా కవర్ చేసేలా దుస్తులు ధరించాలి. చిన్నపిల్లల ఇంకా జాగ్రత్తలు తీసుకోవాలి.
- దోమతెరలు, జాలీలు వాడాలి, దోమలను చంపే క్రీములు, స్ప్రేలు వాడాలి.
- ఇంటిలో, ఇంటి ఆవరణలో నీళ్ల కుండీలు, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో, బావులపై దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు అమర్చాలి.
- పనికిరాని సీసాలు, డబ్బాలు, రబ్బరుటైర్లు, వాటర్ కూలర్లు వంటి పాత్రల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి.

న్యూస్‌రీల్

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సీఎస్ఎస్-ఎస్ఎంఏఎం కింద రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ చేయడానికి మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఏ యంత్ర పరికరాలు ఇస్తారు.. యూనిట్ కాస్ట్ ఎంత, సబ్సిడీ వివరాలను వ్యవసాయ శాఖ విడుదల చేసింది. ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీ ఆగ్రోస్) యంత్రపరికరాలను సరఫరా చేస్తోంది. కర్నూలు జిల్లాకు 1,660 యూనిట్లు మంజూరయ్యాయి. వీటికి సబ్సిడీ కింద రూ.2.87 కోట్లు మంజూరు చేసింది. నంద్యాల జిల్లాకు 1,635 యూనిట్లు మంజూరు చేయగా.. సబ్సిడీ రూ.2.85కోట్లు మంజూరు చేసింది. సబ్సిడీలో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరిస్తుంది. రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

శాస్త్రీయ ఆవిష్కరణలపై దృష్టి సారించాలి


బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీఈఓ ఎస్.శామ్యూల్‌పాల్

కర్నూలు సిటీ: శాస్త్రీయ నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలని డీఈఓ ఎస్.శామ్యూల్‌పాల్ అన్నారు. జాతీయ సైన్స్ వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఈ)లో జిల్లాలోని వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. 'వికసిత్ భారత్ కోసం సైన్స్, ఆవిష్కరణలలో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారత'' అనే అంశంపై క్విజ్, వ్యాసరచన, పోస్టర్ ప్రదర్శన, సెమినార్ నిర్వహించారు. డీఈఓ ఎస్.శామ్యూల్‌పాల్ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని పరిశోధనాత్మకంగా చదవాలని, శాస్త్రీయతను పెంచుకొని సరికొత్త ఆవిష్కరణలను తయారు చేయాలన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ ఆర్.ఆదినారాయణ రెడ్డి, సైన్స్ కో-ఆర్డినేటర్ రంగమ్మ పాల్గొన్నారు.

శ్రీమఠం.. శోభాయమానం


సామూహిక పారాయణంలో సాహిత్య మండలి మహిళలు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు శోభాయమానంగా కొనసాగుతున్నాయి. మంగళవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థు లు నేతృత్వంలో వేడుకలు రమణీయంగా సాగాయి. ఊంజల మంటపం వేదికగా రెండు వేల మంది గురు సార్వభౌమ సాహిత్య ప్రాజెక్టు అకాడమీ మహిళల సామూహిక పారాయణం ఆకట్టుకుంది. అలాగే యాగ మంటపంలో సంస్కృత విద్యా పీఠం విద్యార్థులకు శ్రీమన్ న్యాయసుధాపై పరీక్షలు నిర్వహించారు. బెంగళూరులోని వ్యాసరాజ మఠం విద్యా విజయ తీర్థులు, శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సమక్షంలో పరీక్ష జరిగింది.


విద్వాన్ కేశవాచార్యకు అవార్డు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

వేడుక సందర్భంగా బళ్లారి ఎంపీ తుకారాం, విద్వాన్ కేశవాచార్యకు రాఘవేంద్రుల అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రదానం చేశారు.

బాల్య వివాహాలను అరికట్టండి

ఓర్వకల్లు: బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శాంతికళ సూచించారు. ఆమె మంగళవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని మౌలిక వసతులు, మందులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే ఆడపిల్లలకు పెళ్లి చేయడం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. బాలికలకు శారీరక ఎదుగుదల, చదువు, పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని సూచించారు. శారీరకంగా, మానసికంగా ఎదిగిన తర్వాతే వివాహాలు జరిపించాలని, చిన్నతనంలో వివాహం చేయడం వల్ల త్వరగా గర్భం దాల్చడం, తద్వారా కలిగే ప్రమాదకర పరిస్థితులు, తల్లీబిడ్డ మరణం ముప్పు పెరిగే అవకాశాలున్నాయని, అలా జరగకుండా తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆరోగ్య కార్యకర్తలకు, ఆశావర్కర్లను ఆదేశించారు. గర్భిణుల వివరాలను సకాలంలో ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు.

బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ


ప్రత్యేక అలంకరణలో విష్వక్సేనుడు

ఆళ్లగడ్డ: అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి మఠం పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్రమహా దేశికన్ పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ఎగువ అహోబిలంలోని శ్రీ జ్వాలా నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విష్వక్సేనుడికి తల పాగా చుట్టి పల్లకీలో కొలువుంచి ఆలయం వెలుపలకు తోడ్కొని వచ్చారు. ఈ బ్రహ్మోత్సవాలకు పర్యవేక్షకుడిగా విష్వక్సేనుడు వ్యవహరిస్తారు. అనంతరం పుట్టమన్ను తెచ్చి అంకుర హోమం నిర్వహించి సోమకుంభ స్థాపన చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఎగువ అహోబిలంలో ధ్వజారోహణ కార్యక్రమం, దిగువ అహోబలంలో బ్రహ్మోత్సవ వేడుకలకు అంకురార్పణ పూజలు చేపట్టనున్నారు.

పలుగు పలికెను కూలీల కష్టం



క్షేత్ర స్థాయిలో ఉపాధి హామీ పనుల పరిశీలనకు వెళ్లిన కలెక్టర్ రంజిత్ బాషా కూలీల కష్టం తెలుసుకున్నారు. మంగళవారం వెల్దుర్తి మండలం అల్లుగుండు పరిధిలో జరుగుతున్న పనుల వద్ద పలుగుతో మట్టిని తవ్వి చూశారు. చాలా గట్టిగా ఉండటం, అధిక సమయం పడుతుండటం, వేసవి కావడం, కూలీలకు తక్కువ వేతనం పడుతుండటం తదితర వివరాలు తెలుసుకున్నారు. కూలీలకు కాస్తా వెసలుబాటు కల్పించాలని ఉపాధి అధికారులను ఆదేశించారు. - వెల్దుర్తి

టీడీపీ నేత గోడౌన్‌లో అక్రమ బియ్యం పట్టివేత

- 256 సంచుల బియ్యం సీజ్

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని టీడీపీ నేత గోడౌన్‌లో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, బియ్యం డాన్‌గా పేరొందిన శివకుమార్‌పై కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం నియోజవర్గంలో చర్చనీయాంశమైంది. పట్టణ శివారులోని చిన్న కందుకూరు గ్రామ రహదారిలో ఓ గోడౌన్‌ను టీడీపీ నేత బాడుగకు తీసుకుని నియోజకవర్గ వ్యాప్తంగా సేకరించిన రేషన్ బియ్యం నిల్వ ఉంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటారని సమాచారం. ఈ క్రమంలో బుధవారం గోడౌన్‌లో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమంగా నిలువ ఉంచారని పోలీసులకు సమాచారం అందడంతో డీఎస్పీ ప్రమోద్ ఆదేశాల మేరకు పట్టణ ఎస్‌ఐ నగీన నంద్యాల పౌరసరఫరాల అధికారులకు సమాచారం ఇచ్చి గోడౌన్‌పై


పట్టుబడిన రేషన్ బస్తాలతో ఎస్‌ఐ నగీన, పౌరసరఫరాల శాఖ అధికారులు

దాడులు నిర్వహించారు. దాడుల్లో 256 సంచుల రేషన్ బియ్యం నిలువ ఉంచినట్లు గుర్తించి రేషన్ బియ్యం, గోడౌన్ సీజ్ చేశారు. నిల్వ చేసిన వ్యక్తి పట్టణానికి చెందిన శివకుమార్ అని నిర్ధారణ కావడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నగీన తెలిపారు.

వేతనాలు ఎగ్గొట్టి.. కూలీల కడుపుకొట్టి!

ఉపాధి బకాయిలు రూ.130 కోట్లు
- గత జనవరి 13 నుంచి నిలిచిపోయిన చెల్లింపులు
- మెటీరియల్ పనులకు నిలిచిపోయిన పేమెంట్లు
- ఆందోళన చెందుతున్న కూలీలు
- ఉపాధి పనులకు తగ్గిన హాజరు
- విధిలేని పరిస్థితుల్లో వలసబాట

కర్నూలు(అగ్రికల్చర్): అడిగిన వారందరికీ ఉపాధి కల్పిస్తామని చెబుతున్న అధికారులు వేతనాల చెల్లింపుల విషయంలో నోరు మెదపని పరిస్థితి. జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారుల మాటలు నమ్మి రెక్కలు ముక్కలు చేసుకున్న కూలీలు ప్రస్తుతం ఆకలితో అలమటిస్తున్నారు. రోజులు, వారాలు.. నెలలు గడుస్తున్నా వేతనాలు దక్కకపోవడంతో కూలీలు దిక్కుతోచని స్థితిలో వలస బాట పడుతున్నారు. జనవరి 13 తర్వాత నుంచి ఎలాంటి చెల్లింపులు చేయకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ కారణంగా మహాశివరాత్రి, తిరుణాలను కూడా చేసుకోలేకపోయినట్లు ఉపాధి కూలీలు ఆవేదన చెందుతున్నారు. కర్నూలు జిల్లాలోని పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, పెద్దకడుబూరు, హాలహర్వి, ఆలూరు, ఆదోని, కోసిగి, దేవనకొండ, హొళగొంద, ఆస్పరి, నంద్యాల జిల్లాలోని డోన్, ప్యాపిలి, ఆదోని తదితర మండలాలకు ఉపాధి పనులే ఆధారం. జనవరి రెండవ వారం నుంచి ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు ఒక్క రూపాయి వేతనం కూడా



ఉపాధి పనులకు తగ్గిన హాజరు

చెల్లించిన దాఖలాలు లేవు. కర్నూలు జిల్లాలో ఉపాధి కూలీలకు దాదాపు రూ.25 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.21 కోట్ల మేర బకాయిలు ఉండటం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో లేబర్ కాంపోనెంటు కింద రూ.84 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. కర్నూలు జిల్లాలో పశ్చిమ ప్రాంతానికి సంబంధించిన బకాయిలే దాదాపు 75 శాతం ఉన్నట్లు తెలుస్తోంది. నంద్యాల జిల్లాలో డోన్ నియోజక వర్గంలో వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి పనులే ఆధారం. వ్యవసాయ పనులు లేని సమయంలో వారాల తరబడి వేతనాలు లేకపోవడంతో బతుకు భారమై కూలీలు వలస బాట పడుతున్నారు.

పడిపోతున్న కూలీల హాజరు
ప్రస్తుతం రోజుకు కర్నూలు జిల్లాలో లక్ష మందికి పని దినాలు కల్పించాలనేది లక్ష్యం. కానీ రోజుకు 50వేల మంది కూడా ఉపాధి పనులకు హాజరు కాని పరిస్థితి. దొంగ మస్టర్లు వేస్తుండటం వల్ల ఈ సంఖ్య కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నంద్యాల జిల్లాలో హాజరు మరింత దయనీయంగా మారింది. జనవరి నుంచి ఉపాధి పనులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. కూలీలకు వారం వారం వేతనాలు చెల్లిస్తేనే హాజరు కూడా మెరుగవుతుంది. బకాయిలు భారీగా ఉండటంతో వేతనాలు ఇవ్వని ఉపాధి పనులు మాకొద్దు అనే పరిస్థితి ఏర్పడింది.

మెటీరియల్ పనులకు పేమెంట్లు బంద్
కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ కార్యకర్తల కోసం ఉపాధి నిధులతో సీసీ రోడ్లు, పశువుల షెడ్లు నిర్మిస్తోంది. కర్నూలు జిల్లాలో సీసీ రోడ్లు 900 మంజూరు కాగా 825 పూర్తయ్యాయి. పశువుల షెడ్లు 950 మంజూరు కాగా 630 పూర్తి చేశారు. జనవరి 13 నుంచి మెటీరియల్ పనులకు కూడా పేమెంట్లు నిలిచిపోయాయి. మెటీరియల్ కింద కర్నూలు జిల్లాలో రూ.46 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.38 కోట్ల బకాయి ఉంది. ఉపాధి కూలీల వేతనాలకు కేంద్రం ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు విడుదల చేస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను ఉపాధి కూలీలకు చెల్లించకుండా ఇతర అవసరాలకు మళ్లించడం వల్లే బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది.

మార్చి మొదటి వారంలో నిధుల విడుదల
జిల్లాలో లేబర్ కాంపోనెంటు కింద దాదాపు రూ.25 కోట్లు, మెటీరియల్ కింద రూ.46 కోట్లు చెల్లించాల్సి ఉంది. మార్చి నెల మొదటి వారంలో ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు వేతనాలు జమ అయ్యే అవకాశం ఉంది. వేతనాల విషయంలో కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – వెంకటరమణయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కర్నూలు


జోడు రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

గురుశిష్యుల వైభవం.. భక్తజన పరవశం

గూళ్యం గ్రామంలో గురు శిష్యుల జోడు రథోత్సవం మంగళవారం కనులపండువగా సాగింది. గురుశిష్యులైన కాడ సిద్దేశ్వరస్వామి, గాదిలింగేశ్వరస్వామి రథాలపై కొలువైన అనంతరం భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రథాలు ముందుకు సాగాయి. భక్తులు రథాలపైకి అరటి పండ్లు, పూలు విసురుతూ భక్తిని చాటుకున్నారు. గొరవయ్యల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. – హాలహర్వి

క్లుప్తంగా

ఎన్‌జీఓ అసోసియేషన్ నుంచి నలుగురి బహిష్కరణ

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా బ్రాంచి నుంచి నలుగురు నేతలను బహిష్కరిస్తూ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 20న జరిగిన కార్యవర్గ సమావేశంలో సంఘం వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై జిల్లా కార్యదర్శి వి.జవహర్‌లాల్, ఉపాధ్యక్షులు డి.సాంబశివారెడ్డి. ఆర్‌వీ రమణ, కోశాధికారి భాస్కరనాయుడులను సస్పెండ్ చేస్తూ తీర్మానం చేశారు. వీరిలో మార్పు వస్తే సస్పెన్షన్ ఎత్తివేస్తామని ప్రకటించారు. అయితే ఇటీవల జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ రమణ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డిని టార్గెట్‌గా చేసుకొని పలు ఆరోపణలు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. దీంతో నలుగురిని సంఘం నుంచి బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


నెట్టేకల్ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని అమరావతి నగర్‌కు చెందిన నెట్టేకల్(33) అప్పుల బాధ, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపిన వివరాలు.. అమరావతి నగర్‌కు చెందిన నెట్టేకల్ గోనె సంచులు కుడుతూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో గుడిసె వేసుకునేందుకు రూ.2 లక్షలు అప్పు చేశాడు. వాటిని తీర్చలేక, భార్య పల్లవితో గొడవ పడటం, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుడిసెలోనే చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి బిణిగేరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ వార్డెన్ దుర్మరణం


కృష్ణారెడ్డి(ఫైల్)

కర్నూలు: స్థానిక బళ్లారి చౌరస్తా సమీపంలోని డీ-మార్ట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ వార్డెన్ గుడికాటి కృష్ణారెడ్డి (67) అక్కడికక్కడే దుర్మరణం తిచెందాడు. కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన ఈయన లద్దగిరి బీసీ హాస్టల్ వార్డెన్‌గా పనిచేసి పదవీ విరమణ పొంది ప్రస్తుతం కల్లూరులోని పంచరత్న కాంప్లెక్స్ వీధి (శ్రీచక్ర హాస్పిటల్) వెనుక ఇల్లు నిర్మించుకుని నివాసముంటున్నాడు. ప్రతిరోజూ ద్విచక్ర వాహనంపై బళ్లారి చౌరస్తాలోని మహీంద్రా షోరూమ్ వద్దకు వెళ్లి అక్కడ పార్కు చేసి వాకింగ్ అనంతరం తిరిగి ఇంటికి వెళ్లేవాడు. యథా ప్రకారం మంగళవారం ఉదయం వాకింగ్ ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా డీ-మార్ట్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో కృష్ణారెడ్డి అవయవాలు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ఈయన భార్య కూడా అనారోగ్యంతో మూడు మాసాల క్రితం మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని కుమారుడు రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.


ధనిరెడ్డి లక్ష్మీనరహరిరెడ్డి


నవలూరి శ్రీనాగ ఈశ్వర్


జి.జి.మానస


గోల్డ్ మెడల్ అందుకుంటున్న టి.హర్షిత

కేఎంసీలో చదవడం గర్వకారణం

- అడిషనల్ డీఎంఈ డాక్టర్ రఘునందన్


వైద్య విద్య పట్టాలతో మధుర జ్ఞాపకం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించడం గర్వకారణమని అకడమిక్ డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్ అన్నారు. కర్నూలు మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ 2019 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే అమృత్వ-25 పేరుతో మంగళవారం సాయంత్రం కళాశాల మైదానంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జి.రఘునందన్ మాట్లాడుతూ కర్నూలు మెడికల్ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో ఎంతో పేరు ప్రఖ్యాతలు సాధించారన్నారు. ఇప్పటి విద్యార్థులు కూడా అదే స్ఫూర్తితో విద్యను అభ్యసించాలని సూచించారు. పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ ఎంబీబీఎస్ పూర్తయిన విద్యార్థులు స్పెషాలిటీ కోర్సులపై దృష్టి సారించాలన్నారు. 20 ఏళ్ల క్రితం కర్నూలులో ఇద్దరు మాత్రమే గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉండేవారని, ఇప్పుడు వారి సంఖ్య 16కు పెరగడం గమనించాలన్నారు. నేటి విద్యార్థులు పదేళ్ల ముందుగా ఆలోచించి చదివితేనే విజయం సాధిస్తారన్నారు. కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యంలో విలువలు పాటిస్తూ రోగుల పట్ల సానుభూతి చూపాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ డిప్యూటీ వార్డెన్ డాక్టర్ శ్రీరాములు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రేణుకా దేవి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ విజయానంద బాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్జెక్టు వారీగా గోల్డ్ మెడల్స్ అందుకున్న విద్యార్థులు

- 1. టి.హర్షిత(ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ)
- 2. ధనిరెడ్డి లక్ష్మినరహరి రెడ్డి(ఫిజియాలజీ, ఫోరెన్సిక్ అండ్ టాక్సికాలజీ, జనరల్ సర్జరీ)
- 3. నవలూరి శ్రీనాగ ఈశ్వర్(ఫిజియాలజీ, ఫార్మకాలజీ, మైక్రో బయాలజీ, జనరల్ మెడిసిన్, అబ్‌స్ట్రిక్స్ అండ్ గైనకాలజీ, పీడియాట్రిక్స్)
- 4. జి.జి.మానస(బయోకెమిస్ట్రీ, పాథాలజీ)
- 5. టి.పవన్ సాయి(ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ)
- 6. మద్దిపట్ల మనోజ్ నాయుడు (కమ్యూనిటీ మెడిసిన్)
- 7. కంచి జయశ్రీ వైష్ణవి వర్మ(ఆప్తమాలజీ)


వైద్య విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంఈ తదితరులు


మాట్లాడుతున్న అకడమిక్ డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్


కార్యక్రమానికి హాజరైన వైద్య విద్యార్థుల తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం


ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం

ఆదోని టౌన్: భారీగా కర్ణాటక మద్యాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు తెలిపిన వివరాలు.. ఆలూరు నుంచి బొలేరో వాహనంలో 80 బాక్సులు కర్ణాటక టెట్రా ప్యాకెట్ల లోడుతో ఆదోనికి వస్తుండగా మహాయోగి లక్ష్మమ్మ ఆర్చ్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.3.50 లక్షల దాకా ఉంటుందని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. కర్ణాటక మద్యం తరలిస్తున్న బాషా,అజయ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకోగా, నాగిరెడ్డి పరార్ అయ్యాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సంగాల గ్రామ సమీపంలో ..

ఆలూరు రూరల్: అక్రమంగా తరలుతున్న కర్ణాటక మద్యాన్ని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ లలిత తెలిపిన వివరాలు.. చిప్పగిరి మండలం సంగాల గ్రామ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన ఎరుకల కృష్ణ స్కూటర్‌పై వెళ్తుండగా ఆపి తనిఖీ చేశారు. 7 బాక్సుల కర్ణాటక మద్యం 672 టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్) గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్కూటర్ సీజ్ చేసి, నిందితుడు కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తనిఖీలో ఎస్‌ఐ నవీన్‌బాబు, సిబ్బంది మాలవ్య, సూర్యప్రకాష్, లక్ష్మమ్మ సోమేష్ పాల్గొన్నారు.

కేసీ కెనాల్ వాటా నీటిని విడుదల చేయండి

- టీబీ బోర్డు కార్యదర్శికి లేఖ రాసిన ఈఎన్‌సీ

కర్నూలు సిటీ: తుంగభద్ర జలాశయంలోని నిల్వ నీటిలో కర్నూలు-కడప కాలువ కోటాగా కేటాయించిన నీటిలో నుంచి విడుదల చేయాలని కోరుతూ జల వనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం టీబీ డ్యాం సెక్రటరీకి లేఖ రాశారు. ఈ ఏడాది టీబీ డ్యాంలో నీటి చేరికలను బట్టి కేసీకి 9.4 టీఎంసీలు కేటాయించారు. ఇందులో అక్టోబరులోపు కేసీ కెనాల్ వాటా నీటికి ఇండెంట్ పెట్టకపోవడంతో 1 టీఎంసీ నీరు పక్క జిల్లాకు మళ్లించారు. ఆ తరువాత ఒక టీఎంసీ ఒకసారి, మరో టీఎంసీ, ఇటీవల అర టీఎంసీ నీటిని అనంతపురం హెచ్చెల్సీకి మళ్లించారు. మొత్తం 3.5 టీఎంసీ మళ్లించగా మిగిలిన నీటిలో జనవరి నెలలో 2.5 టీఎంసీల నీటిని టీబీ డ్యాం నుంచి వినియోగించారు. మిగిలిన నీటి నుంచి గత నెల 15 నుంచి నెలాఖరు వరకు రోజుకు 2 వేల క్యూసెక్కుల చొప్పున 1.73 టీఎంసీ నీటిని తీసుకోగా, మిగిలిన నీటిలో నుంచి 1.61 టీఎంసీల నీటిని నేటి(బుధవారం) నుంచి 2,500 క్యూసెక్కుల చొప్పున 8 రోజుల పాటు విడుదల చేయాలని టీబీ బోర్డు కార్యదర్శిని ఏపీ ఈఎన్‌సీ లేఖ ద్వారా కోరారు. టీబీ డ్యాంలో తెలంగాణలోకి ఆర్డీఎస్ కాలువ కోటాగా 1.057 టీఎంసీల నీరు ఉంది. ఈ నీటిని నేటి నుంచి డ్యాం నుంచి విడుదల చేయాలని బోర్డుకు లేఖ రాశారు. దీంతోనే ఏపీ జల వనరుల శాఖ ఇంజినీర్లు సైతం ఆర్డీఎస్ కోటాతో కలిసి కేసీ కోటా నీరు విడుదల చేస్తే నీరు వృథా కాకుండా ఉంటుందనే ఉద్దేశంతోనే కోటా నీటికి ఇండెంట్ పెట్టారు. కేసీ కెనాల్ పరిధిలో 90,200 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. ప్రస్తుతం సుంకేసుల బ్యారేజీ, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా కూడా నీటి విడుదల నిలిచిపోయింది. మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి మాత్రమే 675 క్యూసెక్కుల నీటిని కేసీకి పంపింగ్ చేస్తున్నారు. వాస్తవానికి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి సైతం నీటిని పంపింగ్ చేసేందుకు శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి మట్టం ఉన్నప్పటికీ ఇంజినీర్లు నీటిని పంపింగ్ చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రైతుకో నేలబావి!

- 350 ఎకరాలకు అవే ఆధారం
- ఒకే గ్రామ పరిధిలో దాదాపు 70 వరకు నేల బావులు
- కొన్నేళ్ల వరకు అన్ని అవసరాలకూ అవే నీరు వినియోగం
- తెలుగుగంగ, పాలేరు సాగునీటి రాకతో తగ్గిన ప్రాధాన్యం
- కొందరు రైతులకు ఇప్పటికీ అవే ఆధారం

ఇప్పుడైతే బోరు బావులు వేయడం పరిపాటిగా మారింది. కానీ కొన్నేళ్ల క్రితం నేల బావులే రైతులకు ఆధారం. అందులో నంద్యాల మండల పరిధిలోని పెద్దకొట్టాల గ్రామ పరిధిలో దాదాపు 70 నేల బావులుండేవి. వ్యవసాయ సాగుతో పాటు అన్ని అవసరాలకూ వాటినే ఉపయోగించుకునేవారు. తెలుగుగంగ, పాలేరు సాగునీటి రాకతో వాటి అవసరం కాస్త తగ్గినా కొందరు రైతులకు మాత్రం అవే వ్యవసాయానికి ఉపయోగపడుతున్నాయి. ఇక ఇదే గ్రామంలో ఇళ్ల పరిసరాల్లోనూ నేల బావులుండేవి. కాలక్రమేణా కొందరు పూడ్చి వేయగా.. మరికొన్ని కంప చెట్లు మొలిచి శిథిలావస్థకు చేరుకున్నాయి.


పొలంలో ఏర్పాటు చేసుకున్న నేల బావి

నంద్యాల(అర్బన్): నంద్యాల మండల కేంద్రానికి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దకొట్టాల గ్రామంలో 2,200 కుటుంబాలు 1,250 ఎకరాల సాగు భూములు ఉన్నాయి. ఈ ఊరిలో ఏళ్ల నుంచి సాగు, తాగునీటికి నేల బావులే ఆధారం. గతంలో బావుల నీటినే అన్ని పనులకు వినియోగించుకునే వారు. ఎప్పుడూ తాగునీటి ఎద్దడి ఉండేది కాదని గ్రామస్తులు చెబుతున్నారు. అప్పట్లో నివాసాల్లో బోర్లు వేసే ప్రయత్నాలు ఎన్నో సార్లు చేసినా వీలు కాలేదు. కాలక్రమేణా గ్రామస్తులు కొందరు తన నివాసాల్లో బావులు తవ్వుకున్నారు. ముందుగా తవ్విన వారి నివాసాల్లోని బావుల్లో ఎండాకాలంలోనూ బావి అడుగంటకుండా ఉండకపోవడం, నీరు తాగేందుకు మంచిగా ఉండటంతో ప్రతి ఒక్కరూ తమ నివాసాల్లోనూ బావులు తవ్వించారు. మహిళలకు వీధి బావుల వద్ద నుంచి బిందెల మోత తప్పి, నివాసాల్లోని బావుల వద్దే నీటిని చేదుకునేవారు. అందరి నివాసాల్లో బావులకు మోటార్లు అమర్చుకుని తాగు నీటికి ఎలాంటి ఢోకా లేకుండా జీవించేవారు. దీంతో గ్రామంలో మొత్తం 70 నుంచి 80 దాకా నేల బావులు ఉండేవి. అనంతరం కాలంలో పొలాల సాగులో భాగంగా ప్రస్తుతం 60 నుంచి 70 దాకా నేల బావులున్నాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పలు కాలనీల్లో వాటర్ ట్యాంకులు, ప్రైవేటు మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు అయ్యాయి. దీంతో పంచాయతీ ఆధ్వర్యంలో పైప్‌లైన్ల ద్వారా తాగు నీరు వస్తుంది. నివాసాల్లో తవ్వుకున్న బావుల నుంచి నీటిని వాడకాలకు ఉపయోగించుకుంటున్నారు. అదే విధంగా పొలాల్లోని నేల బావుల నీరు సాగునీటికి ఉపయోగపడుతుంది.

తెలుగుగంగ, పాలేరు సాగునీటి రాకతో..

గ్రామం మీదుగా తెలుగుగంగ కాల్వ ఏర్పాటు కావడం, పాలేరు నీటిని పొలాలకు మళ్లించుకోవడంతో నేల బావుల నీటి వాడకం తగ్గింది. తెలుగుగంగ నీరు నీటితో వందలాది ఎకరాల్లో రెండు కార్ల పంటలు పండుతుండగా పాలేరు నీరు కూడా రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. దీంతో నేల బావుల ఉపయోగంతగ్గింది.

కొంత మంది రైతులకు వాటితోనే వ్యవసాయం

నివాసాల్లో ఏర్పాటు చేసుకున్న నేల బావులు అత్యవసరాలకు ఉపయోగపడుతుండగా పొలాల్లో ఏర్పాటైన బావులు కొంత మంది రైతులకు సాగునీటి అవసరాలకు ఉపయోగపడుతున్నాయి. దాదాపు 350 ఎకరాల దాకా బావుల కింద పొలాలు సాగు అవుతున్నట్లు సమాచారం. వర్షాలు సకాలంలో కురవని సమయాల్లో నేల బావులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని స్థానిక రైతులు పేర్కొంటున్నారు. ఏ కాలంలోనైనా బావుల్లో నీరు తగ్గే పరిస్థితి తలెత్తదని స్థానిక రైతులు పేర్కొంటున్నారు. జూన్, జూలై మాసాల్లో ఖరీఫ్ సాగుకు వర్షాలు కురియక పోతే వరి నారు మడులు మొత్తం బావుల కిందనే సాగవుతాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటే తప్ప పంటలు పండకపోవడం జరగదని రైతులు ధీమాగా చెబుతున్నారు. వరికోతలు పూర్తయిన తర్వాత అదే భూముల్లో మళ్లీ దుక్కి దున్ని మార్చి నుంచి సెప్టెంబర్ వరకు కొంత మంది రైతులు కూరగాయలు పండించుకుంటున్నారు.

బావుల ఆధారంతో సాగు



గ్రామంలో 350 ఎకరాలకు పైగా వరిసాగును నేల బావుల సాయంతో పంటలు పండించుకుంటున్నాం. .అవే లేకుంటే గ్రామంలోని మెట్ట పొలాల్లో పంటలు పండించుకోలేం, ప్రతి రైతు తమ పొలంలో బావి తవ్వించుకుని, ఆ నీటి ఆధారంగా ప్రతి ఏటా పంటలు పండించుకుంటున్నారు.

– శీలం నందిరెడ్డి

నేల బావులు ఉపయోగకరం



గ్రామంలో ఏర్పాటైన నేల బావులు అన్ని రకాలుగా ఉపయోగపడుతున్నాయి. తెలుగుగంగ, పాలేరు నీరు లేనప్పుడు బావుల ద్వారా నే సాగు, తాగునీరు అందేది. కాలక్రమేణా వాటర్ ట్యాంకులు, మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు కావడంతో నేల బావుల నీరు తా గడం మానేశారు. అత్యవసరాలకు నేలబావు ల నీరు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– పోల్‌రెడ్డి

క్లస్టర్ యూనివర్సిటీ వీసీకి వీడ్కోలు సన్మానం


వీసీ దంపతులను సన్మానిస్తున్న రిజిస్ట్రార్, అధ్యాపకులు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ వీసీగా పని చేస్తున్న ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ పదవీ కాలం ముగియడంతో మంగళవారం వర్సిటీ అనుబంధ కాలేజీ సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు, రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్, మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు పా ల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీకి మొదటి వీసీగా పని చేయడం సంతోషంగా ఉందన్నారు. వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, వాసంతి దంపతుల ను ఘనంగా సన్మానించారు. వీసీ నేను నా ఆత్మకథ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్సి టీ అనుబంధ కాలేజీల ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎం ఇందిరాశాంతి. డాక్టర్ వీవీఎస్ కుమార్, చంద్రశేఖర్ కల్యాూర, రచయిత రమణయ్య పాల్గొన్నారు.



ఆశల ‘గాలం’

శ్రమజీవులు జానెడు పొట్ట నింపుకునేందుకు నిరంతరం కష్టపడుతూనే ఉంటారు. అందులో భాగంగానే కుందూనదిలో ఓ జాలరి ఆశల గాలాన్ని విసురుతున్నాడు. కుందూలో ఇప్పుడిప్పుడే నీటి ప్రవాహం తగ్గుముఖం పడుతుండటంతో చేపల వేటకు మార్గం సులువైంది. దీంతో జాలరులు వలలు వేయడం మొదలెట్టారు. పుల్లయ్య అనే జాలరి వలను విసురుతుండగా ‘సాక్షి’ క్లిక్ మనిపించింది.

– దొర్నిపాడు